# కాంప్లెక్స్ కథలు

## కాలనాగు కాంప్లెక్స్



డా॥ సి. ఆనందారామం

ఒక మహర్షి బోధను శిరసావహించి అహింసా వ్రతం పూనింది కాలనాగు. దానిని అసమర్థతగా భావించి ప్రతి ఒక్కరూ దానిపై రాళ్ళు రువ్వి హింసించసాగారు. మరి కొన్నాళ్ళకు మహర్షి ఆ దారిన రాగా తన దురవస్థ విన్నవించుకొంది నాగు. "కాటువేసి ప్రాణం తియ్యవద్దన్నాను కాని, బుసలుకొట్టి భయపెట్టవద్దన్నానా?" అని సందేశమిచ్చాడు మహర్షి.

—రామకృష్ణ పరమహంస నీతి కథావళి.

ఇది మంచితనాన్ని అసమర్థతగా భావించి హించించే మదాంధులకు, బుసకొట్టి బుద్ధి చెప్పే కాలనాగు కాంప్లెక్స్—

* * *

ఎర్రగా నిప్పులు కక్కుతూ చూసింది రంగమ్మ. అదిరిపడ్డాడు కిష్టయ్య—అదేం చూపు? కొత్త పెళ్ళికూతురు సిగ్గు సిగ్గుగా వయ్యారాలు పోతూ వాలు చూపులు....విసరాల్సిందిపోయి, ఇలా నిలువునా కాలుస్తున్నట్టు చూస్తుందేమిటి?

"ఏశే, ఆ చూపు? ఎందుకంత కోపం?" బెంబేలుగా అడిగాడు.

వాడలా బెదిరి పోతున్నట్టుగా దీనంగా మాట్లాడుతోంటే రంగమ్మ మరింత చీదరించు కుంటున్నట్టుగా చూసి "ఛీ! సిగ్గులేదూ?" అంది.

"దేనికే? మీబాబు కట్టమన్నంతా ఓలి కట్టాను. రెండు తులాలు బంగారం పెట్టాను. మంచి చీరలు కొన్నాను — ఎందుకు సిగ్గుపడాలేంటి?"

"ఆ ముఖం చూడు! ఒలికట్టాడంట! బంగారంపెట్టాడంట! సీరలు కొన్నాడంట! — నువ్వే కొన్నావా ఇయ్యన్ని? అంతా నీ సంపాదనేనా?"

"చిన్నయ్య కట్టాడనుకో! ఆయన కడితేనేం? నేను కడితేనేం?"

"అట్టాగా! నాతో సంసారం ఆయన సేస్తే యేమి? నువ్వు సేస్తే యేమి? అవతలకునడు!"

"ఏయ్! ఏంటే ఆ మాటలు?"

"ఓ యబ్బో! కోపంకూడా ఉంటాదే? పరవాలేదు! అయితే ఈ చేతకాని చచ్చినోళ్ళందరికి పెళ్ళాల ముందే పౌరుషం...."

"నీ మీద ప్రేమకొద్దీ ఊరుకుంటావుంటే, మరీ పేలతన్నావు. జాగ్రత్త!"

"అబ్బో, ప్రేమ! నా మీద అందరికీ ప్రేమ-ఒకటే ప్రేమ! కని పెంచిన అయ్యకి తట్టెడు ప్రేమ! కట్టుకున్నోడికి బుట్టెడు ప్రేమ! ఈ ప్రేమలతోనే ఛస్తున్నా" క్రింద కూలబడి ఏడవటం మొదలు పెట్టింది రంగమ్మ—కిష్టయ్యకి మతిపోయింది. తాను మొదటి రాత్రిళ్ళ గురించి రకరకాల కథలు విన్నాడు కానీ, ఇలాంటి కథ ఎక్కడా వినలేదు....ఏం చెయ్యాలో తోచటంలేదు వాడికి. బంగారు బొమ్మలాంటి రంగమ్మ ఏడుస్తోంటే చూడలేక పోతున్నాడు.... "ఊరుకోయే!" అన్నాడు బేలగా.

రంగమ్మ కోపంగా "నువ్వు ఒట్టి వెర్రిబాగులోడివి— కుక్కలా యిశ్వాసంగా కాళ్ళకాడ పడుండేవోడివి — చెప్పుదీసు కొట్టినా కిక్కురుమననోడివి. ఒక కల్లు ముంతకోసం నీ పెళ్ళాన్ని

మరోడి కప్పజెప్పే సన్యాసివి...." అని ఇంకా ఏదేదో అనబోతుండగా గానే "ఏయ్...." అని చెంప ఛెళ్ మనిపించాడు కిష్టయ్య.

ఆ దెబ్బకు కళ్ళు తిరిగి క్రింద పడింది రంగమ్మ. తనను కోపంగా చూసే కిష్టయ్యను చూసి చిరునవ్వు నవ్వి "ఈ మాటలు నాయికావు - మీ చిన్నయ్యవి" అంది.

కిష్టయ్య మళ్ళీ బెంబేలుగా అయిపోయి "ఏంటీ?" అన్నాడు.

"నువ్వట్టా జాలిగా మాట్లాడితే నాకు మండుద్ది. ఇందాక అరి చావే అట్టా అరు. నా చెంప పేలగొట్టావే అట్టాగే నీ కన్నేయం చేసినోళ్ళందరి చెంపా పేలగొట్టు."

"చిన్నయ్యతో నువ్వెప్పుడు మాటాడేవే?"

"ఒరి పిచ్చోడా! మాటలేంటి? ఇప్పుడు నా కడుపులో వున్నది ఆడి చిట్టే!"

"ఏంటీ!"

"ఏం? తల తిరుగుతుందా? చిన్నయ్య ఓలి కట్టినప్పుడు. బంగారం పెట్టినప్పుడు. సీరలు కొన్నప్పుడు తల తిరగలేదా? నీ చిన్నయ్యకి ఆ మాత్రం గొప్ప మనసుకూడా వుందను కున్నావా?"

కిష్టయ్య గభాలున గుడిసె బయటి కొచ్చేసాడు.

"ఇప్పుడు నా కడుపులో వున్నది ఆడి చిట్టే!...." రంగమ్మ మాటలు హోరు మంటున్నాయి కిష్టయ్య మనసులో.


నెల రోజుల క్రిందట చిన్నయ్య నవ్వుతూ అడిగాడు- "ఏరా కిష్టిగా! రంగమ్మని మనువాడతావా?'' అని.

కిష్టయ్య తెల్లబోతూ "ఓరి నాయనో! రంగమ్మ నాకెక్క-డందుతాదండీ! అది ఎర్రగా బుర్రగా వుంటాదనీ, పనిపాటలు సేస్తాదనీ దానయ్య రెండొందలు ఓలి అడుగుతున్నాడు. అదీగాక ఇంకా రెండు తులాల బంగారం పెట్టాలంట! నాకెట్టాగొస్తాదండే!" అన్నాడు.

చిన్నగా చిద్విలాసంగా నవ్వాడు చిన్నయ్య.

"డబ్బుకోసం నువ్వు దిగులు పడకురా! రంగమ్మని మను వాడతావా-లేదా, చెప్పు?"

"దాన్నెవడొద్దంటాడండీ!" సంబరంగా అన్నాడు కిష్టయ్య.



ఆ తరువాత చిన్నయ్య తనే ఓలి డబ్బులూ, బంగారమూ రంగమ్మ తండ్రి చేతుల్లో పెట్టాడు. ఆ రోజు కిష్టయ్య, చిన్నయ్య కాళ్ళమీద పడి ఒకటే పొగిడేసాడు. పెళ్ళికూడా చిన్నయ్యే దగ్గరుండి జరిపించాడు. "నువ్వు దేవుడివి చిన్నయ్యా!" అని దణ్ణం పెట్టాడు. తనమీద చిన్నయ్యకెంత అభిమానమో అని పొంగిపోయాడు. అయితే, చిన్నయ్య అంత చేసింది.....

రగులుకు పోయింది కిష్టయ్య మనసు. తప్పతాగి ఇంటికి వచ్చిన కిష్టయ్యతో "అన్నం తిను" అంది రంగమ్మ.

"ఏం వద్దు. అవతలకి పో" అని కసిరాడు కిష్టయ్య.

''ఎందుకూ? నేను పాపిష్టిదాన్ని, సెడిపోయిన దాన్ని, నాసేతి కూడు తినవు-అంతేనా?''

కిష్టయ్య మాట్లాడలేదు. ఏదైనా ఆలోచించే దశలో లేదు వాడి మనసు. తను ఇన్నాళ్ళుగా ఎంతో నమ్మకగా కొలిచిన ఆ యజమాని తనకెందుకింత ద్రోహం చేసాడన్నదే వాడికి అంతుపట్టని సమస్య.

"నేను సెప్పింది యినగానే, యెల్లి ఆడిని చావ తంతావను కున్నాను. కనీసం ఆడి దగ్గర పని వదిలేస్తా వనుకున్నాను. ఇంకా ఆడి కాళ్ళు పట్టుకు యెల్లాడతా, నామీద కోపం చూపిస్తున్నావా?"

"నోర్ముయ్యే! నన్నెవడు మనువాడమన్నాడే నిన్ను? రెండు మాటలు సెప్పగానే ఆడికి లొంగిపోయా. ఎదురు ఎవరిదో తప్పయి నట్టు వాగుతావేమే?"

లోలోపల కుమిలి కుమిలిపోతున్న కిష్టయ్యను జాలిగా చూసింది రంగమ్మ.

"నిజమే, నాదే తప్పు—ఆడి మాటలు నమ్మాను. ఈ పాడు దరిద్రం వదిలి, బంగళాల్లో ఉంటాననుకున్నాను. మాటలు మాటలే! అళ్ళక్కడే, మనమిక్కడే - అని తెలుసుకోలేక పోయాను. దేవుడి మీదొట్టు మావా! నేను నిన్ను మనువాడతా ననలేదు. అయ్యకి అంతా చెప్పేసాను. అయ్య చావబాది గుడిసెలోంచి బయటికి రాకుండా కట్టు దిట్టం చేసాడు. నీకిచ్చి పెళ్ళిచేసేసాడు. ఇదంతా, ఆ చిన్నయ్యా, మా అయ్యా కలిసాడిన నాటకమే! మనమంతా ఇట్టాంటోళ్ళం కాబట్టే ఆళ్ళ ఆటలు సాగుతున్నయ్."

ఏడవసాగింది రంగమ్మ. రంగమ్మ ఏడుస్తోంటే ఎంతో జాలి కలిగింది కిష్టయ్యకి అంతలో అసహ్యమూ కలిగింది.

"నేను నిన్ను ఒదిలేస్తాను. ఎక్కడికి పోతావో పో!"

"వద్దు."

"ఛీ! పాడు ముఖమా! ఇంకా నిన్ను ఏలుకుంటానను కుంటు న్నావా?"

"నిన్ను ఏలుకోమంటం లేదు, నన్నొదిలేసావంటే నాతోపాటు ఆ బంగారమూ మా అయ్యకి దక్కుద్ది. నా వంటిమీన నగలు తీసుకుని ఎటైనా పోయి బ్రతుకు. ఈ దరిద్రుడి కాడ పనిచెయ్యకు."

"ఏంచేయ్! ఆలోచనలు సెప్తున్నావు. నేను పోతే ఆడితో కులుకుదావంనా?"

"పిచ్చోడా! నువ్వు యెర్రోడివని మీ చిన్నయ్య ఊరికే అనలేదు. 'ఆడొట్టి యెర్రిబాగులోడు-తెలుసుకోలేడు. తెలిసినా యేవనడు. ఈ పెళ్ళి పేరుకే! మనకే అడ్డూ ఉండదు' అన్నాడు. ఆడితో కులకా లనుకుంటే, ఈ విషయాలన్నీ నీతో ఎందుకు చెప్పేదాన్ని? నీ చాటుగా ఆడితో బాగోతం నడిపే దాన్ని. నా మనసు మండిపోతోంది. ఆడికి బుద్ధి చెప్పాల. ఏదో చెయ్యాల. ఏం చెయ్య లేకపోతే చావనైనా చావాల. అందుకే నిన్ను పొమ్మంటున్నాను. నీ యిష్టం!"

కిష్టయ్య సమాధానం చెప్పలేదు. ఆలోచిస్తూ పడుకున్నాడు.

ఆ రోజు చిన్నయ్య సోగ్గా అలంకరించుకుని వచ్చాడు రంగమ్మ దగ్గిరికి.

"ఎందుకొచ్చావ్?" అంది రంగమ్మ మండిపడుతూ.

"ఏంటే? కొత్తోడిని అడిగినట్లు అడుగుతున్నావ్?" అన్నాడు చిన్నయ్య.

"కొత్తోడి వయితే యజమాని వొచ్చాడని గౌరవించేదాన్ని! పాతోడివి కనుకే, ఎందుకొచ్చావని అడుగుతున్నాను?"

"పతివ్రతలా పోజు పెట్టకే! అప్పుడంతా కనుసైగ చేస్తే కాళ్ళ మీద వాలేదానివి. ఇప్పుడు కొత్తగా నీతులు నేర్చుకుంటున్నావా?"

"అప్పుడైనా ఇప్పుడైనా నా నీతి నాదే! ఆ నాడు నీ మాటలు నమ్మాను, లొంగిపోయాను. ఈనాడు నువ్వేంటో తెలిసింది. దగ్గిర కొచ్చావంటే చంపి పాతేస్తా నంటున్నాను."

ఆ ఉగ్ర స్వరూపానికి బెదిరి ఒక్క అడుగు వెనక్కి వేసాడు చిన్నయ్య. ఆ సమయంలో వచ్చాడు కిష్టయ్య. చిన్నయ్య వెకిలి నవ్వుతో-

"అప్పుడే పని పోయిందా కిష్టయ్యా?" అన్నాడు.

కిష్టయ్య ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా "మీరెందు కొచ్చారిక్కడికి?" అన్నాడు.

"ఆఁ....ఏదో.... ఊరికే...."

"మరెప్పుడు ఈ గుడిసెలో కాలు బెట్టకండి!"

"ఒరేయ్! నీ పెళ్ళాం ఏదో పతివ్రత అనుకుంటున్నావేంటిరా? ఇది...."

చిన్నయ్య చెంప చెళ్ళుమంది. కళ్ళు బైర్లు కమ్మగా విభ్రాంత పోయి చూసాడు. చలనం లేకుండా నిలబడ్డాడు కిష్టయ్య.

పళ్ళు నూరుకుంటూ వెళ్ళిపోయాడు చిన్నయ్య.

సుడిగాలిలా వచ్చి వాడిని అల్లుకు పోయింది రంగమ్మ. వాడు దాన్ని తోసి పారెయ్యలేదు.

ఆ మరునాడే వంటినిండా దెబ్బలతో వచ్చాడు కిష్టయ్య. రంగమ్మ గుండె బాదుకుంటూ "ఓయ్ నాయనో! ఈ దెబ్బలన్నీ ఏంటి?" అంది.

"చిన్నయ్య పని...."

"పాపిష్టోడు! ఆడే కొట్టాడా? తిరగబడి తన్నకపోయావా?"

"ఆడు కొట్టలేదు. పనిలో ఏదో తప్పు చూపించి మనోళ్ళ తోనే కొట్టించాడు. మనం ఇట్టా ఉండబట్టే... హూ...."

కిష్టయ్య దెబ్బలు వారం రోజులకి గాని తగ్గలేదు. ఆ తరువాత కిష్టయ్య చిన్నయ్య దగ్గరకి పనిలోకి పోకుండా మరో చోట పని చూసుకోవాలని ప్రయత్నించాడు. కానీ, చిన్నయ్య పలుకుబడి వల్ల అతనికి మరోచోట పని దొరకలేదు. పది రోజులకి పైగా ఇలా అవస్థ పడ్డాక, ఆ తర్వాత మరో వారం రోజులు కిష్టయ్య అక్కడా యిక్కడా తిరిగాడు. చివరకు చిన్నయ్య దగ్గరకే వచ్చి "అయ్యా! రంగి మిమ్మల్ని రమ్మంటాంది. ఎప్పుడొస్తారు?" అన్నాడు.

చిన్నయ్య పొంగిపోయి మీసం మెలేసుకుని 'వెధవ జాతి, ఇంతే! కుక్కల్లాగా నా కాళ్ళదగ్గిరకి రావలసిందే!' అని మనసులో

అనుకుని. "రేపొస్తాలేరా" అని అభయమిచ్చి "ఆరుగంటలకి" అని జాగ్రత్త చెప్పి, "వచ్చి పనిలో చేరు" అని ఔదార్యం ప్రకటించాడు.



"చిత్తం!" అన్నాడు కిష్టయ్య పరమానందంగా. ఆ మరునాడు చిన్నయ్య సరిగ్గా ఆరుగంటలకి వచ్చాడు. రంగమ్మ చిరునవ్వుతో ఆహ్వానించింది. ఇద్దరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ ఉండగా, మరో నలుగురు యువకులతో కలిసి కర్రలు పట్టుకుని వచ్చాడు కిష్టయ్య. అయిదుగురూ చిన్నయ్యని అక్కడి చెట్టుకు కట్టేసి గొడ్డును బాదినట్టు బాదారు. బాది బాది కర్ర క్రింద పారేసి ఒగురుస్తూ అన్నాడు కిష్టయ్య- "చిన్నయ్యా! నువ్వేంచేసినా పడుంటున్నది చేతకాక కాదు. నీ ఉప్పు తింటూ నీ కెదురు తిరగటం ధర్మం కాదనుకున్నాం. కానీ, చిన్నయ్యా! నీలాంటి వాళ్ళని ఏం చేసినా ధర్మమేనని ఇప్పుడు తెలి

పింది. చక్కగా ఆరుగంటలకి ఇంట్లో ఉంటానని సైమిచ్చావు. నీ ఇంట్లోపడి ఇల్లంతా దోచుకున్నాము. ఇక ఈ ఊరిడిచి పోతున్నాము. పోలీసులకి చెప్పావో, జాగ్రత్త! నీ గుట్లన్నీ నా చేతిలో ఉన్నాయి. ఏం తెలీనోడినని అనుకోకు. రేప్పొద్దున్న ఎవరో ఒకరొచ్చి నీ కట్లిప్పుతారులే. ఇక్కడెందుకున్నావని అడిగితే ఏదో ఒకటి చెప్పు. ఒకవేళ నలుగురూ నవ్వినా, నీకు సిగ్గేంటి? ముఖాన ఊసినా తుడిచేసుకుని తిరగ్గలవు."

కర్రలు చేత్తో పట్టుకుని సంచీలు భుజాన్నేసుకుని అయిదుగురు బయలుదేరారు.

రంగమ్మ నిలబడిపోయింది. కిష్టయ్య వెనక్కి తిరిగి "రాయే!" అన్నాడు. రంగమ్మ కన్నీళ్ళతో "నా కడుపులో ఉన్నది ఈడి బిడ్డ" అంది.

"ఫరవాలేదు రాయే! ఈడి బిడ్డని పెంచి ఆడిచేతే ఆళ్ళయ్యకి బుద్ధి చెప్పిద్దాం. రా- రా!"

రంగమ్మని చెయ్యి పట్టుకు ముందుకు లాగాడు. కొంగు నడుములో దోపి వాళ్ళతో అడుగు కలిపింది రంగమ్మ. ✱

